సాక్షి అనకాపల్లి

శనివారం, 28, అక్టోబర్, 2023



అర్జీలకు స్పష్టమైన సమాధానం

బుచ్చెయ్యపేటలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో 393 అర్జీలు అందాయి. కలెక్టర్, జేసీ వినతులు స్వీకరించారు.

8లో



కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

విశాఖలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదురోజులు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉంటాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న 33.4, 29న 33.7, 30న 34.2, 31న 34, 1న 33.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

మొత్తం ఓటర్లు 12,57,707

- పురుషుల కంటే మహిళలే అధికం
- 1529 పోలింగ్ స్టేషన్ల గుర్తింపు
- పెందుర్తి మినహా ఆరు నియోజకవర్గాల వివరాలు వెల్లడించిన కలెక్టర్

పురుషులు
6,13,144

మహిళలు
6,44,516

ఇతరులు
47

సాక్షి, అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక ప్రక్రియ మొదలైంది. దాదాపు 50 రోజులపాటు మహా యజ్ఞంలా నిర్వహించిన ఇంటింటి సర్వే అనంతరం చేపట్టిన మార్పులు, చేర్పులు మదింపు చేసి.. ఎన్నికల కమిషన్ ఆమోద ముద్ర వేసిన తర్వాత.. ఓటరు జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శుక్రవారం విడుదల చేశారు. 43 రోజుల పాటు ముసాయిదాపై ఓటర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం.. మరోసారి మదింపు ప్రక్రియ నిర్వహించి తుది జాబితాను వచ్చే ఏడాది జనవరి 5న ఎన్నికల కమిషన్ విడుదల చేయనుంది. జిల్లాలో గుర్తించిన మొత్తం ఓటర్లలో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువగా ఉండటం గమనార్హం. పాత ఓటర్ల జాబితా ప్రకారం ఆ ఇంటిలో ఓటర్లు ఉన్నారా లేదా.. లేకపోతే వారు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు.. ఓటును ఉంచాలా, తీసెయ్యాలా, లేదా వేరే చోటుకు బదిలీ చేయాలా.. 18 ఏళ్లు నిండినవారు ఓటు నమోదు చేసుకున్నారా.. ఇలా వివిధ కోణాల్లో ఇంటింటి సర్వే జరిపి ఎన్నికల సిబ్బంది వివరాలు సేకరించారు. ఓటర్ల చిరునామా, పేర్లు, ఫొటోలు సరిచూసి కచ్చితమైన డ్రాఫ్ట్‌ని సిద్ధం చేశారు. సమగ్ర పరిశీలన అనంతరం మార్పులు చేర్పులు జరిగిన తర్వాత గురువారం సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించారు.

రాజకీయ పార్టీలతో సమావేశం..

ఓటరు జాబితా ముసాయిదా ప్రచురించిన నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శుక్రవారం సమావేశమయ్యారు. ప్రచురించిన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రతులను గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలకు అందజేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత పోలింగ్ కేంద్రం వద్ద, బూత్ లెవల్ అధికారి, మండల తహసీల్దారు, కలెక్టర్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఓటరు లిస్టులను ప్రతి ఒక్కరు పరిశీలించు కోవాలని, వాటిలో తొలగింపులు, చేర్పులు వంటి అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. ఫారం 6, 7, 8 ద్వారా వాటిని సరిచేసుకునే అవకాశం ఉందని వివరించారు. సమావేశంలో జేసీ జాహ్నవి, డీఆర్వో దయానిధితో పాటు వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన, బీఎస్పీ, ఆమ్‌ఆద్మీ, సీపీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.



డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ

డ్రాఫ్ట్‌లో ఉన్న ఓటర్ల వివరాలపై అభ్యంతరాల్ని డిసెంబర్ 9 వరకు స్వీకరించనున్నారు. పేరు, చిరునామా, నియోజకవర్గం, భార్యాభర్తలకు వేర్వేరు బూత్‌ల కేటాయింపు.. ఇలా ఏ అభ్యంతరాలున్నా సంబంధింత నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ అధికారులకు తమ అభ్యంతరాలను తెలపవచ్చు. జిల్లా ఎన్నికల యంత్రాంగం నవంబర్ 4, 5 తేదీల్లో, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనుంది. బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అభ్యంతరాలు తీసుకునే బాధ్యతని బీఎల్‌వోలకు అప్పగించనున్నారు. వాటి పర్యవేక్షణను ఈఆర్వోలు చేపడతారు.



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
చోడవరం	243	1,03,656	1,09,884	8	2,13,548
మాడుగుల	235	90,255	94,711	5	1,84,971
అనకాపల్లి	251	99,666	1,06,356	5	2,06,027
యలమంచిలి	246	98,975	1,03,742	15	2,02,732
పాయకరావుపేట	292	120778	1,23,896	2	2,44,676
నర్సీపట్నం	262	99814	1,05,927	12	2,05,753
మొత్తం	1529	6,13,144	6,44,516	47	12,57,707



జనవరి 5న ఓటర్ల తుది జాబితా

డిసెంబర్ 26 నాటికి వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లు పరిశీలించి పరిష్కరించనున్నారు. 2024 జనవరి 1న ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ, తనిఖీ ప్రక్రియ జరుగుతుంది. అనంతరం ఎన్నికల కమిషన్ జనవరి 5న తుది జాబితాను ప్రకటిస్తుంది. ఈ జాబితా ప్రకారమే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంటుంది.

ఏ ఒక్కరి ఓటు పోకుండా ఉండాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో.. జిల్లా పరిధిలోని ప్రతి ఎన్నికల అధికారి.. ప్రతి ఒక్క ఓటును నిశితంగా పరిశీలించి చర్యలు చేపడుతున్నారు. తప్పులు లేని జాబితా తయారు చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేస్తున్నారు.

ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు

డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో వచ్చిన అభ్యంతరాల్ని పరిగణనలోకి తీసుకుంటాం. ఇంకా ఎవరైనా ఓటర్లుంటే వారి కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాం. మొత్తం 4 రోజులపాటు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారు. యువ ఓటర్లు ఫారమ్-6, భారతీయ పాస్‌పోర్టు కలిగిన విదేశాల్లోని భారతీయుల కోసం ఫారం-6 ఏ, జాబితాలో పేర్లు తొలగించడం, చేర్చడంపై అభ్యంతరాలకు ఫారం-7, మార్పులు చేర్పుల కోసం ఫారం-8ని వినియోగించుకోవాలి. దరఖాస్తు విధానాన్ని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ ద్వారా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో), సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఏఈఆర్వో) లేదా బీఎల్‌వోలకు దరఖాస్తు ఫారాలు ఇవ్వొచ్చు. ఆన్‌లైన్‌లో www.voters.eci.gov.in వెబ్‌సైట్‌లోగానీ, ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటు నమోదు చేసుకోవచ్చు.

– రవి పట్టాన్‌శెట్టి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

కలెక్టరేట్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశాం. 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ఏ సమస్యలున్నా.. తమ ఫిర్యాదుల్ని మీ దగ్గర్లో ఉన్న ఓటర్ల నమోదు అధికారి/ సహాయాధికారులుగా వ్యవహరిస్తున్న తహసీల్దార్, జోనల్ కమిషనర్లు లేదా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలోనైనా నిరభ్యంతరంగా చెప్పవచ్చు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూరల్ పరిధిలో ప్రతి బూత్ లో 1500, అర్బన్ పరిధిలో 1200 మంది ఓట్లకు మించి ఉండకుండా చూడాలి. ఈ విభజన క్రమంలో కుటుంబ సభ్యుల ఓట్లు తారుమారవుతాయి. ఆ సమయంలో వారు దరఖాస్తు చేసుకుంటే.. ఏ బూత్‌లో ఉండాలని కోరుకుంటే ఆ బూత్‌కు అడ్జెస్ట్ చేస్తాం.

– దయానిధి, జిల్లా రెవిన్యూ అధికారి

జగనన్న పాలనలో సామాజిక విప్లవం

- సాధికారత కల్పించి, ఉన్నత స్థానాల్లో నిలిపిన ముఖ్యమంత్రి
- చరిత్రలో నిలిచిపోయేలా సామాజిక సాధికార బస్సు యాత్ర
- 2న మాడుగుల, 9న అనకాపల్లిలో నిర్వహణ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి టౌన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గీయులకు సాధికారత కల్పించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని, ఆ ఘనతను చాటేందుకు సామాజిక సాధికార బస్సు యాత్ర చేపట్టామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 2వ తేదీన జిల్లాలో మాడుగుల ఘాట్‌రోడ్డుకు సామాజిక సాధికార బస్సు యాత్ర చేరుకుంటుందని చెప్పారు. 9న అనకాపల్లి నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, ఎంపీ బి.వి.సత్యవతి, బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ నాయకులు బస్సుయాత్రలో పాల్గొంటారన్నారు. 21 మంది మంత్రులున్న కేబినెట్‌లో 15 పదవులు, 22 ఎమ్మెల్సీ స్థానాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గీయులకు కేటాయించారని, 4 రాజ్యసభ సభ్యత్వాలను బీసీలకు ఇచ్చారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సామాజిక సాధికారతకు ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలన్నారు.

9 నుంచి 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'..

ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం వచ్చే నెల 9వ తేదీన ప్రారంభమవుతుందని బొడ్డేడ ప్రసాద్ చెప్పారు. 2014 ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని గద్దెనెక్కిన చంద్రబాబునాయుడు మహిళలను మోసం చేశారని విమర్శించారు. 2019లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా మహిళలకు 5 దఫాలుగా రుణమాఫీ చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానిదేనన్నారు. అందుకే 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

గ్రామాల్లో పల్లె నిద్ర

వైఎస్సార్‌సీపీ పల్లె నిద్ర పేరుతో వినూత్నమైన కార్యక్రమం చేపడుతుందని ప్రసాద్ చెప్పారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు గ్రామాల్లో సమస్యలు తెలుసుకునేందుకు ఇది దోహదపడుతుందన్నారు. గ్రామ ప్రజలతో కలిసి భోజనం చేసి, రాత్రికి అక్కడే నిద్రిస్తామన్నారు. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు గ్రామ సచివాలయాల వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో గడప గడపకు వెళ్లి 'ఆపు బాబూ నాటకం– జగనే మా నమ్మకం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. 2014లో చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌లు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కారని దుయ్యబట్టారు. 2019లో జగన్ ఇచ్చిన హామీలను ఒక పుస్తకంలో చేర్చి, ప్రజలకు అందించామన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయో లేదో తెలుసుకోనున్నామన్నారు. ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పార్టీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు, పార్టీ నాయకులు, శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాల నియంత్రణకు ప్రణాళిక

- 40 హైరిస్క్ ప్రాంతాల గుర్తింపు
- చెక్‌పోస్టులతో గంజాయి రవాణాకు అడ్డుకట్ట
- కశింకోట స్టేషన్ సందర్శించిన ఎస్పీ మురళీకృష్ణ



కశింకోట: జిల్లాలో జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు ప్రణాళికలు తయారు చేసి చర్యలు చేపడతామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. కశింకోట పోలీసు స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులను సమీక్షించారు. నేరాలు, ప్రమాదాల నియంత్రణకు పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే 40 ప్రాంతాలను గుర్తించామన్నారు. ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి ప్రణాళికలు తయారు చేయాలని డీఎస్పీ వి.సుబ్బరాజును ఆదేశించామన్నారు. కశింకోట కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు గతం కంటే తగ్గాయన్నారు. డౌనూరు, కె.డి.పేట, కోనాం, తాటిపర్తి ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి గంజాయి రవాణా నియంత్రణకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇవి కాకుండా అక్కడక్కడ 11 వరకు తాత్కాలిక చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నియంత్రించామన్నారు. ఇప్పుడు ఒడిశాలోని మల్కన్‌గిరి తదితర ప్రాంతాల నుంచి అడపాదడపా గంజాయి వస్తుందని, జిల్లా నుంచి గంజాయి రవాణా లేదన్నారు. కశింకోట, బయ్యవరంలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సమర్థవంతంగా పని చేస్తున్నాయని, నేరాల నియంత్రణకు ఉపకరిస్తున్నాయన్నారు. కశింకోట, అనకాపల్లి ప్రాంతాల్లో పోలీసు సిబ్బందికి క్వార్టర్ల పునర్నిర్మాణంపై చర్యల కోసం సంబంధిత అధికారులకు నివేదించామన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనం చేశారు. సీఐ రవికుమార్, ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ఉపమాక వెంకన్న ఆలయం మూసివేత

నక్కపల్లి: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా ఉపమాకలోని కల్కి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం 5 గంటలకు మూసివేస్తున్నట్టు ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు తెలిపారు. ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం దర్శనాలకు అనుమతిస్తామన్నారు.

రిమాండ్ ఖైదీ పరార్

- విశాఖ కేంద్ర కారాగారం నుంచి యలమంచిలి కోర్టుకు తరలిస్తుండగా ఘటన



రిమాండ్ ఖైదీ నూకరాజు

యలమంచిలి: చోరీ కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఓ నిందితుడు కోర్టుకు తరలిస్తుండగా ఎస్కార్ట్ పోలీసుల కళ్లుగప్పి పరారైన ఘటన శుక్రవారం యలమంచిలిలో చోటు చేసుకుంది. యలమంచిలి సీఐ షేక్ గఫూర్, పట్టణ ఎస్సై పాపినాయుడు తెలియజేసిన వివరాలు.. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిల్లా నూకరాజు (31) ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నెంబరు 397/23తో నమోదైన కేసులో నిందితుడు. ఈ నెల 14న నిందితుడిని ఎస్.రాయవరం పోలీసులు అరెస్ట్ చేసి యలమంచిలి ఏజేఎఫ్ఎమ్ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నిందితుడు నూకరాజును విశాఖ కేంద్ర కారాగారంలో ఉంచారు. శుక్రవారం కోర్టు వాయిదా ఉండడంతో కోర్టులో హాజరు పరచడానికి ఎస్కార్ట్ పోలీసులు ఆర్టీసీ బస్సులో యలమంచిలి తీసుకొచ్చారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు దిగిన తర్వాత టాయిలెట్‌కు వెళ్లొస్తానని చెప్పి నిందితుడు క్షణాల్లో అక్కడ్నుంచి పరారయ్యాడు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో జరిగింది. ఎస్కార్ట్ పోలీసులు ఎంత వెతికినా నూకరాజు జాడ తెలియక పోవడంతో యలమంచిలి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏఎంసీలో శతాబ్ది సందడి

- ఘనంగా శతాబ్ది ఉత్సవాలు
- పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఏఎంసీ పైలాన్ వద్ద లేడీ డాక్టర్ల సెల్ఫీ సందడి



మాట్లాడుతున్న మంత్రి విడదల రజని

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాలలో శుక్రవారం సందడి నెలకొంది. పూర్వ విద్యార్థులు, వైద్యులు, దేశ విదేశాల్లో స్థిరపడ్డ అనేక మంది ఆంధ్ర వైద్య కళాశాలకు తరలివచ్చారు. పూర్వ వైద్య విద్యార్థుల రాకతో ఒక్కసారిగా ఏఎంసీ ప్రాంగణం కళకళలాడింది. ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొడానికి వచ్చే వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. శుక్రవారం ఒక్కరోజే దాదాపు మూడు వేల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, పీజీ చదివి దేశ, విదేశాల్లో స్థిరపడ్డ వైద్యులు, వైద్య విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. సెంటినరీ సెలబ్రేషన్స్ సావనీర్‌ను మంత్రి విడదల రజిని విడుదల చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున, డీఎంఈ డీఎస్వీఎల్ నరసింహం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బాబ్జీ, మధ్యప్రదేశ్ ఆయుష్మాన్ భారత్ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఇ.రమేష్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్, సెకండరీ ఎడ్యుకేషన్ సంచాలకులు ఎస్. వేంకటేశ్వర్, ఎమ్మెల్సీ డాక్టర్ రవీంద్ర బాబు, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, నార్త్ అమెరికా ప్రెసిడెంట్ మైనేని నాగేంద్ర, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, సెలబ్రేషన్స్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టి. రవిరాజు, అంకోసా ప్రెసిడెంట్ కె. శశిప్రభ, ఏఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆంధ్రా మెడికల్ కళాశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్ఫీలు దిగిన పూర్వ విద్యార్థులు

ఆంధ్రా మెడికల్ కాలేజీలో పూర్వ విద్యార్థులు శుక్రవారం సెల్ఫీలు దిగారు. పూర్వ విద్యార్థులంతా కలిసి సెంటినరీ బ్లాక్, పైలాన్, ఇతర నిర్మాణాల వద్ద సెల్ఫీలు దిగారు.

ఏఎంసీ తల్లిలాంటిది



ఆంధ్రా మెడికల్ కళాశాల తల్లిలాంటి సంస్థ. 1986లో ఎంబీబీఎస్ ఇక్కడే చదువుకున్నా. చదువు పూర్తయిన తర్వాత అమెరికాలో ఉద్యోగం రావడంతో అక్కడే స్థిరపడ్డాను. చదువుకున్న సంస్థకు ఏదో విధంగా సాయం చేయాలని ఇక్కడ చదువున్నవాళ్లమంతా నిర్ణయించుకున్నాం. 1981 నుంచి నేటి వరకు కేజీహెచ్, ఏఎంసీలకు సుమారు రూ.50 కోట్లు సాయం అందించాం. కరోనా సమయంలో కేజీహెచ్‌కు అవసరమైన వైద్య పరికరాలు, ఆక్సిజన్ పరికరాలు ఇచ్చాం. వైద్యపరంగా ఎలాంటి సాయాన్ని అయినా అందించడానికి సిద్ధంగా ఉన్నాం.

– మైనేని నాగేంద్ర, అధ్యక్షుడు, ఆంధ్రా మెడికల్ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్– నార్త్ అమెరికా

న్యూస్‌రీల్

ఉప రాష్ట్రపతి విశాఖ రాక నేడు



మహారాణిపేట: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ శనివారం తొలిసారి విశాఖ రానున్నారు. ఆయన సతీమణి సుదీష్ ధన్కర్‌తో కలిసి ఢిల్లీ నుంచి విమానంలో ఉదయం 11 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. వారికి గవర్నర్ అబ్దుల్ నజీర్ స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి బయలుదేరి నేరుగా ఆంధ్ర మెడికల్ కాలేజీకి చేరుకుంటారు. అనంతరం బీచ్ రోడ్డులోని ఏయూ కాన్వొకేషన్‌లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.05 గంటల వరకు జరిగే ఆంధ్రా మెడికల్ కాలేజీ సెంటినరీ ఉత్సవాల్లో పాల్గొంటారు. అక్కడి నుంచి ఐఎన్ఎస్ డేగాకు బయలు దేరుతారు. అక్కడ కొద్ది సేపు విశ్రాంతి తీసుకుంటారు. ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి ఢిల్లీ బయలు దేరుతారు. ఉప రాష్ట్రపతికి వీడ్కోలు అనంతరం 4.35 గంటలకు గవర్నర్ గన్నవరం బయలు దేరుతారు.

రాంబిల్లి నేవల్ బేస్ ఉప కలెక్టర్ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన మనోరమ, పక్కన పాత ఉప కలెక్టర్ జ్ఞానవేణి

అచ్యుతాపురం (అనకాపల్లి): రాంబిల్లి నేవల్ బేస్ ఉప కలెక్టర్‌గా మనోరమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. యలమంచిలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఆమె అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. గతంలో ఉప కలెక్టర్‌గా పనిచేసిన జ్ఞానవేణి బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో మనోరమ వచ్చారు.

ఉపాధ్యాయిని మృతిపై విచారణ

దేవరాపల్లి: రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కె.జీ.బీ.వి. సైన్సు ఉపాధ్యాయిని బొడ్డు శ్రీదేవి మృతిపై డీఈవో ఆదేశాల మేరకు మండల విద్యాశాఖాధికారి బి.పడాల్‌దాసు శుక్రవారం విచారణ చేపట్టారు. స్థానిక కె.జి.బి.వి. ప్రత్యేకాధికారి చొక్కాకుల భావన మాధురితోపాటు గురువారం ఇన్‌చార్జి ప్రత్యేక అధికారిగా వ్యవసరించిన అనురాధ, సహచర ఉపాధ్యాయులను ఎంఈవో విచారించారు. ఈ విచారణలో మరో ఎంఈవో ఉషారాణి పాల్గొన్నారు. నివేదికను డీఈవోకు పంపించినట్లు తెలిపారు.

వీఎంఆర్‌డీఏ కార్యదర్శిగా కీర్తి




కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కీర్తి

దొండపర్తి: వీఎంఆర్‌డీఏ నూతన కార్యదర్శిగా దాట్ల కీర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సెక్రటరీగా విధులు నిర్వర్తించిన రంగయ్యను శ్రీకాకుళం ఆర్డీవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అతని స్థానంలో కీర్తిని నియమించడంతో ఆమె సెక్రటరీగా చార్జ్ తీసుకున్నారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేటి మధ్యాహ్నం 2.30 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: చంద్రగ్రహణం కారణంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు శనివారం మధ్యాహ్నం 2.30గంటల వరకు మాత్రమే లభిస్తాయని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈసందర్భంగా రాత్రి ఆరాధన టికెట్లు రద్దు చేశామన్నారు. తిరిగి ఆదివారం ఉదయం 8 గంటల నుంచి దర్శనాలు పునః ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అలాగే ఆదివారం ఉదయం జరిగే సుప్రభాతసేవ, ఆరాధన టికెట్లను రద్దు చేశామన్నారు. అలాగే స్వర్ణపుష్పార్చన, గరుడసేవలను రద్దుచేసినట్టు చెప్పారు.

జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా సురేష్



డాబాగార్డెన్స్: జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా బి.సురేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలల కిందట డైరెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లిన సురేష్‌ను ప్రభుత్వం జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా నియమించింది. సీసీపీగా ఉన్న సునీతను డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. సురేష్ గతంలో జీవీఎంసీ సీసీపీగా, వీఎంఆర్‌డీఏ సీయూపీగా, జీవీఎంసీలో డీసీపీగా బాధ్యతలు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను సిటీ ప్లానర్ లక్ష్మీదొర, డీసీపీలు నరేంద్రనాథ్‌రెడ్డి, పద్మజ, ఏసీపీలు, టౌన్‌ప్లానింగ్ అధికారులు అభినందనలు తెలిపారు.

జగన్నకు చెబుదాంతో అర్జీలకు స్పష్టమైన సమాధానం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- బుచ్చెయ్యపేటలో జగనన్నకు చెబుదాంకు విశేష స్పందన

బుచ్చెయ్యపేట: మారుమూల ప్రాంతాల్లో సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం పేద, మధ్య తరగతి ప్రజలకు వరంగా మారుతోంది. మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణులకు ఏ సమస్య వచ్చినా కలెక్టరేట్‌కు పరుగులు తీయాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం జిల్లాల విభజనతోపాటు కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేసినప్పటికీ జిల్లా వాసులందరూ వారానికొకసారి జరిగే స్పందన కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కలెక్టర్ స్థాయి అధికారులు పరుగులు తీస్తున్నారు. అక్కడ గ్రామీణుల సమస్యలను కళ్ల ముందే పరిష్కరిస్తుండటంతో పల్లె ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



అర్జీలదారులతో సందడిగా మారిన ఎంపీడీవో కార్యాలయం

393 అర్జీల స్వీకరణ

జగనన్నకు చెబుదాం(స్పందన)కు వచ్చే అర్జీలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. బుచ్చెయ్యపేట ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమాధానంలో తిరస్కరణకు గల కారణాలను వివరంగా తెలియజేయాలన్నారు. అర్జీలను వేగంగా పరిష్కరించాలన్నారు. 393 అర్జీల్లో భూ, రేషన్‌కార్డుల దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్‌తోపాటు జేసీ జాహ్నవి, అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజు, జీఎస్‌వీఎస్ ప్రత్యేకాధికారి మంజులవాణి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుని దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

గవర్నర్‌కు ఘన స్వాగతం



విమానాశ్రయంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని,

గోపాలపట్నం: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు శుక్రవారం విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జి.సుభద్ర, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో ఆయన నగరానికి బయలుదేరారు. శనివారం జరిగే ఏఎంసీ శతాబ్ది వేడుకల్లో ఆయన పాల్గొనున్నారు.

నర్సీపట్నం ఆర్టీసీ డిపోకు రూ.36 లక్షల ఆదాయం

- ఆదర్శ ఉద్యోగులకు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి అభినందన



డోర్ డెలవరీ స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి పద్మావతి

నర్సీపట్నం: శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా డిపోకు రికార్డు స్థాయిలో ఆదాయం తీసుకువచ్చిన ఆదర్శ ఉద్యోగులను జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి అభినందించారు. డిపో మేనేజర్ ఎం.ఎస్.ఎస్.ధీరజ్ ఆధ్వర్యంలో స్థానిక డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఆమె విచ్చేసి పార్సిల్ డోర్ డెలివర్ మాసోత్సవాల్లో భాగంగా డోర్ డెలవరీ స్టిక్కర్లను ఉద్యోగులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్యుపెన్సీ రేషియో తీసుకురావడంతోపాటు దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు 71 ప్రత్యేక బస్సులు నడుపుట ద్వారా డిపోకు రూ.36,56,515 ఆదాయం రావటంలో ఉద్యోగుల కృషి ఎంతో ఉందన్నారు. గతేడాది రూ.34 లక్షలు వస్తే ఈ ఏడాది ఆదాయం పెరిగిందన్నారు. డోర్ డెలవరీ మాసోత్సవాల సందర్భంగా 50 కిలోల పార్సిళ్లను ముఖ్యమైన పట్టణాలకు అతి తక్కువ ఖర్చుతో అత్యంత వేగంగా ఇంటికే చేరవేస్తున్నామన్నారు. సిబ్బందిని సమన్వయం చేసుకుని డిపోకు అత్యధిక ఆదాయం తీసుకువచ్చేందుకు కృషి చేసిన డీఎం ధీరజ్‌ను అభినందించారు. జిల్లా అసిస్టెంట్ మేనేజర్ రవిచంద్ర, డిపో సిబ్బంది, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారిణికి అభినందన

తుమ్మపాల: మారుమూల పల్లెల్లో పిల్లల ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా అంతర్జాతీయ స్థాయి అవార్డులు సాధిస్తున్నారని ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ అన్నారు. ఇటీవల మలేషియాలోని అంతర్జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో బంగారు పతకం సాధించిన మొందుపాలెం గ్రామానికి చెందిన పసుపులేటి హేమను ఆయన శుక్రవారం అభినందించారు. ఈమె రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక ఖోఖో క్రీడాకారిణిగా మన దేశం తరపున అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని సత్తా చాటిందన్నారు.

మన ప్రాంతానికి మంచి పేరు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ దాడి రత్నాకర్, జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి సీహెచ్ఎల్ఎం.శ్రీనివాసరావు, సభ్యులు కె.ఎం.నాయుడు, దాడి శ్యాంప్రసాద్, ఎం.వి.నాగేశ్వరరావు, డి.జె.నాయుడు, పీలా వీరునాయుడు, కర్రి సూర్యనారాయణ పాల్గొన్నారు.



అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారిణి హేమను అభినందిస్తున్న దాడి జయవీర్

స్థాయీ సంఘంలో అన్నీ ఆమోదం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించారు. జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్థాయీ సంఘం అజెండాలో 52 అంశాలతో పాటు 4 టేబుల్ అజెండా అంశాలు పొందుపరచగా, మొత్తంగా 56 అంశాలను సభ్యులు ఆమోదించారని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రూ.11 కోట్ల 16 లక్షల అభివృద్ధి పనులు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికుల ఏర్పాటుకు రూ.44.06 లక్షలు, క్రీడా విభాగానికి సంబంధించి రూ.44.60 లక్షలు, రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు పొడిగింపులు, ఉద్యోగుల ప్రొబేషన్, సర్వీస్ స్పెషల్ ఇంక్రిమెంట్లు తదితర అంశాలతో పాటు ఇతర అంశాలను సభ్యులు ఆమోదించారన్నారు. సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతో పాటు అదనపు కమిషనర్ వై శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఏఎంవోహెచ్ సీహెచ్ సత్యనారాయణ, డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి

అలరించిన బాలల బృంద గానం



దేశభక్తి గేయాలను ఆలపిస్తున్న బాలికలు

నర్సీపట్నం: జిల్లా స్థాయి బాలల ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా శుక్రవారం బాలల బృంద గాన పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో జూనియర్స్ నుంచి 30 బృందాలు, సీనియర్ విభాగం నుంచి 45 బృందాలు పాల్గొన్నాయి. ఆయా బృందాల బాలలు పోటాపోటీగా దేశభక్తి గీతాలను ఆలపించారు. పోటీల్లో పాల్గొన్న బాలలను ఉద్దేశించి పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ మాట్లాడుతూ బాలల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా టి.ఎస్తేరురాణి, ఎస్.వరలక్ష్మి, ఎస్.సంఘమిత్ర వ్యవహరించారు.

నేడు భీమిలిలో సాధికార బస్సు యాత్ర

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని జిల్లాలో ప్రజలకు, పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎండాడలో లా కాలేజీ సమీపంలో పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ కార్యాలయంలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు మీడియా సమావేశంలో మాట్లాడతారన్నారు.

10 నుంచి చెకుముకి సైన్స్ పోటీలు

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరులోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 8, 9, 10 తరగతుల విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు సహకరించాలని కోరారు. వచ్చే నెల 10న పాఠశాల స్థాయి, 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, 2024 జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యాశాఖ ఏడీ ఆడారి రవికుమార్, జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి బి.ఉమామహేశ్వరరావు, విజ్ఞాన వేదిక నాయకులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

గొల్లవిల్లి బాధ్యతల స్వీకారం



గొల్లవిల్లి శ్రీనివాసరావును సత్కరిస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్

అనకాపల్లి టౌన్: అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి శ్రీనివాసరావు శుక్రవారం మార్కెట్ యార్డు ఆవరణలో బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ అధికారులు, నూతన కమిటీ సభ్యుల సహకారంతో మార్కెట్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన చెప్పారు. శ్రీనివాసరావును రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు శాలువాలతో సత్కరించారు.

21 కేజీల గంజాయి పట్టివేత

- ముగ్గురు తమిళ యువకులకు రిమాండ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

గొలుగొండ: మండలంలోని రావణాపల్లి పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 21 కేజీల గంజాయిని శుక్రవారం గొలుగొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నారాయణరావు వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన యువకులు శంకర్ (27), జ్ఞానకుమార్ (20), అత్తి పట్టు(30) అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి బైక్‌పై రెండు బ్యాగ్‌ల్లో 21 కేజీల గంజాయి తరలిస్తుండగా రావణాపల్లిలో పట్టుకున్నారు. వీరి నుంచి బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో గొలుగొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

- ముగ్గురి అరెస్టు, 8 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం

అనకాపల్లి టౌన్: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠాను శుక్రవారం అనకాపల్లి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ ఎస్సై సీహెచ్ నర్సింగరావు వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు సాయంత్రం 7 గంటల సమయంలో అనకాపల్లి మండలం కొప్పాక గ్రామంలోని ఓ ఇంట్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతుండగా ముగ్గురిని పట్టుకున్నారు. పట్టణంలోని గవరపాలెంకు చెందిన నిందితులు కాండ్రేగుల జగన్, ఎల్లపు చక్రవర్తి, పెంటకోట మహేష్‌ల నుంచి ఎనిమిది సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, రూ.11 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సెల్‌ఫోన్ల నుంచి అధిక మొత్తంలో ట్రాన్సాక్షన్లు చేసినట్టు గుర్తించారు. వీరి మొబైళ్లలో ఫోన్ పే నుంచి ఎవరెవరికి నగదు లావాదేవీలు జరిగాయో విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మేడివాడ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో మేడివాడ ఉపాధ్యాయ బృందం

రావికమతం: మండలంలోని మేడివాడ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖపట్నం ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని మోపాడ భాగ్యశ్రీ అండర్-14 విభాగంలో కబడ్డీ, ఖోఖో, సాఫ్ట్‌బాల్, 600 మీటర్లు, 22 మీటర్లు పరుగు పందెంలో సత్తా చాటింది. రగ్బీ పోటీల్లో అండర్-17 విభాగంలో టెన్త్ విద్యార్థి ప్రవీణ్ ప్రకాష్, అండర్ -14 విభాగంలో ఎస్.లిఖిత ప్రతిభ చాటారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం వంకాయల రామారావు తెలిపారు. ఉపాధ్యాయులతో కలిసి సదరు విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో అభినందించారు.

మేడ పిట్ట గోడపై నుంచి పడి వ్యక్తి మృతి



నాగేశ్వరరావు మృతదేహం

రాంబిల్లి: మూలజంప గ్రామానికి చెందిన పి.నాగేశ్వరరావు (48) ప్రమాదవశాత్తు మేడ పిట్ట గోడపై నుంచి పడి మృతి చెందాడు. ఎస్ఐ దీనబంధు కథనం ప్రకారం.. ఈ గ్రామంలో గురువారం రాత్రి దుర్గాలమ్మ జాతర చూసేందుకు మేడ పిట్ట గోడపైకి ఎక్కిన నాగేశ్వరరావు కాలు జారి సిమెంటు రోడ్డుపై పడిపోయాడు. కుటుంబసభ్యులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిగా తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శుక్రవారం మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పాల్గొన్న కొణతాల ఈశ్వరరావు దంపతులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 185వ ఊంజల్ సేవా కార్యక్రమాన్ని శుక్రవారం ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయిలు నిర్వహించారు. ఉంజల్ సేవలో కొణతాల ఈశ్వరరావు, పుష్పలత దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, పాలక వర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు హేయం



పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలంటూ నిరసన తెలుపుతున్న పీడీఎస్‌వో నాయకులు

తుమ్మపాల: అమెరికా అండతో పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దురాక్రమణ హేయమని, ఈ యుద్ధాన్ని నిరసిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌వో) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద జరిగిన నిరసనలో పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ పాలస్తీనా భూభాగంలోకి ఇజ్రాయెల్ చొరబడి నరమేధాన్ని సృష్టిస్తోందన్నారు. ఆయిల్, ఆహారం, నీరు అందించకుండా చేసి పాలస్తీనా జాతి అంతానికి పాల్పడటాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. కాందిశీకులుగా పాలస్తీనాకు వచ్చిన ఇజ్రాయెల్ ఇప్పుడు పాలస్తీనా ఇళ్లపై, గాజాలోని ఆస్పత్రులపై బాంబుల వర్షం కురిపిస్తూ, వేల మంది మరణానికి, లక్షల మంది నిరాశ్రయులయ్యేందుకు కారణమవుతోందని ఆరోపించారు. స్వేచ్ఛ కోసం పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు మేధావులు, వివిధ వర్గాల ప్రజలు సంఘీభావం తెలపాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకులు యు.జానకీరామ్, ఎస్.నగేష్, జగదీష్ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
టైగర్ నాగేశ్వరరావు	: పర్తిసాయి
గణపథ్(తెలుగు)	: వెంకటేశ్వర
ఓటు చాలా విలువైనది (ఉ॥ మ॥)	
ధీమహి (ఫస్ట్ షో, సెకండ్ షో)	: శ్రీసత్య
భగవంత్ కేసరి	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 1,172 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,950	4,530
రెండో రకం	3,500	4,080
మూడోరకం	3,010	3,480

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-6 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్ (97036 19706) నంబరును సంప్రదింవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 422 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 389 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఊరూవాడా.. 'ఆరోగ్య సురక్ష'

- వైద్య శిబిరాలకు భారీగా తరలివస్తున్న ప్రజలు
- ఉద్యమంలా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

ప్రజారోగ్యమే పరమావధిగా సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులతో ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోంది. ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, 104, ఫ్యామిలీ డాక్టర్ సేవలతో ఇప్పటికే ప్రజల మన్ననలు అందుకుంది. ప్రభుత్వ ఆరోగ్య సేవల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు కీలకంగా మారాయి. ప్రతి గ్రామంలో నిపుణులైన వైద్యులతో అందిస్తున్న ఆరోగ్య సేవలపై అన్ని వర్గాల ప్రజల్లోనూ ఆనందం వ్యక్తమవుతోంది.



రోగికి కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి



రక్తపరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



అనారోగ్య వివరాలు తెలుసుకుంటున్న వైద్యుడు



ఐసీడీఎస్ స్టాల్లో పౌష్టికాహారాన్ని రుచి చూస్తున్న టీడీపీ కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి



వైద్యశిబిరంలో ఇచ్చిన మందులు తీసుకు వెళ్తున్న రోగి



మహిళను వీల్ చైర్‌లో వైద్య పరీక్షలకు తరలిస్తున్న సిబ్బంది



వైద్య సేవలందిస్తున్న ప్రత్యేక వైద్యురాలు గ్రేసీ కేథరిన్

అనకాపల్లిటౌన్: మెరుగైన వైద్యసేవలు గ్రామ స్థాయికి చేరడంతో అధిక సంఖ్యలో ప్రజలు తమ ఆరోగ్య సమస్యల పరిష్కారానికి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను వినియోగించుకుంటున్నారని అనకాపల్లి జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ తెలిపారు. జీవీఎంసీ వీలీన గ్రామమైన సిరసపల్లి యూపీహెచ్‌సీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దాదాపు నెల రోజులుగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. పెద్ద ఎత్తున గ్రామీణ ప్రజలు వైద్యశిబిరాలకు తరలి వచ్చి, వారి సమస్యలను వైద్యులకు విన్నవించుకుని, ఉచిత మందులతో పరిష్కారం పొందుతున్నారని పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు రక్తపరీక్షలు, బీపీ, సుగర్ వంటి పరీక్షలు జరిపి, టోకెన్లు అందించిన వారితోపాటు, స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రోగులు కూడా వైద్య సేవలు పొందారు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని చాలా మంది ప్రజలు ఆనందంగా చెప్తున్నారు. వైద్యశిబిరంలో 340 మందికి వైద్యసేవలు అందించగా, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 20 మంది రోగులను అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి, విశాఖ కేజీహెచ్‌కు సిఫార్సు చేశారు. ఐసీడీఎస్ పరిధిలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, స్పెషలిస్టు వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సచివాలయం ఉద్యోగులు, జీవీఎంసీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఊడేరు శిబిరంలో 337 మందికి వైద్య సేవలు

అనకాపల్లి రూరల్: గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో రోగులు శిబిరాలకు తరలి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. నిపుణులైన వైద్యులు రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. మండలంలోని ఊడేరు సచివాలయం పరిధిలో ఎంపీపీ పాఠశాల వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తగరంపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన శిబిరాన్ని ఉదయం గ్రామ సర్పంచ్ సరిగిరి శెట్టి కృష్ణమోహన్, ఎంపీటీసీ పెద్దాడ అచ్చియ్యమ్మ ప్రారంభించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్య సేవలపై ఆరా తీసి, అవసరమైనవారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ శిబిరాల ద్వారా గ్రామీణ ప్రాంత రోగులు, వృద్ధులు, నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. శిబిరంలో 337 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 131 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 21 మందిని శస్త్రచికిత్సలకు, 91 మందిని కళ్లద్దాలకు సిఫార్సు చేశారు. 130 మందికి బీపీ, 109 మందికి సుగర్ పరీక్షలు జరిపారు. 21 మందిని మెరుగైన చికిత్సకోసం జిల్లా, ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేశారు. పలువురు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిబిరానికొచ్చిన రోగులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. వైద్యులు మైనవతి, ప్రత్యూష, జి.రమ, వాణీ జగదీశ్వరి, తగరంపూడి ఎంపీహెచ్‌ఈవో పి.సన్యాసిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దాడ రామ్ శంకర్, సకల సంతోష్, పలువురు అధికారులు, వైద్యులు, పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని తీడ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన చివరి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి అత్యధిక ప్రజాదరణ లభించింది. మండలంలో నిర్వహించిన 18 శిబిరాల్లో ఇక్కడి శిబిరానికే అత్యధికంగా ప్రజలు హాజరయ్యారు. తీడతోపాటు సచివాలయ పరిధిలోని చెరకాం, కచ్చర్లపాలెం, రెడ్డివానిపాలెం, పాత కస్నూరుపాలెం తదితర గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చి వైద్య సేవలు పొందారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఎంపీపీ కలగా లక్ష్మి ప్రారంభించిన శిబిరంలో 624 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో 154 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక వైద్యులు గ్రేసీ కేథరిన్, అనిసిన్, పీహెచ్‌సీ వైద్యులు యశోద, యు.రమేష్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఆప్తాలమిక్ అధికారి పవన్ కల్యాణ్ కంటి పరీక్షలు నిర్వహించి 37 మందికి కేటరాక్టు ఆపరేషన్లు, 70 మందికి కళ్లద్దాల కోసం సిఫార్స్ చేశారు.

ప్రత్యేక ఆయుర్వేద సేవలు

శిబిరంలో కస్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యురాలు కె.లావణ్య వైద్య సేవలందించారు. ఆయుర్వేద మందుల ప్రయోజనాన్ని వివరించారు. యోగా శిబిరాలపై ఆసనాలు వేయించి అవగాహన కల్పించారు. ఔషధ మొక్కల పెంపకం, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాలు, గింజ ధాన్యాలు, జగనన్న సంపూర్ణ పోషణ కిట్లను ప్రదర్శించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కలిగించారు. ప్రకృతి వ్యవసాయ వనరుల శాఖ తరఫున ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయలు, ఆకు కూరలు, పండ్లను ప్రదర్శించారు. పాఠశాలలో అందించే జగనన్న గోరుముద్ద పౌష్టికాహారంపై ఉపాధ్యాయులు ప్రదర్శన నిర్వహించారు.

కార్యక్రమంలో జిల్లా ప్రొగ్రాం కోఆర్డినేటర్ జగదీష్, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మండల వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఎంఈవో మూర్తి, సర్పంచ్ చిరికి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు దుంగల అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ రత్నం, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



ఊడేరు శిబిరంలో రోగికి మందులు అందిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



మహిళకు బ్లడ్ సుగర్ పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



ఊడేరు శిబిరంలో ఫార్మసీ కౌంటర్ వద్ద మందులు తీసుకుంటున్న రోగులు



వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యురాలు



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాల ప్రాధాన్యంపై గర్భిణులకు అవగాహన



ఆయుర్వేదిక్ శిబిరంలో సేవలందిస్తున్న ఆయుర్వేద వైద్యురాలు లావణ్య



ప్రకృతి వ్యవసాయి ఉత్పత్తుల ప్రదర్శన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ అధికారి పవన్ కల్యాణ్



జగనన్న ఆరోగ్య సురక్షలో యోగాపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న శిక్షకులు



వైద్య పరీక్షల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

ఘనంగా ఖాదరీబాబా ఉరుసు మహోత్సవం

కశింకోట: స్థానికంగా ప్రసిద్ధి చెందిన హజరత్ సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరీబాబా దర్గా ఉరుసు మహోత్సవం(చందనోత్సవం) శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉత్సవంలో భాగంగా చందనాన్ని సంప్రదాయంగా గుర్రంపై ఊరేగించారు. దర్గా నుంచి ముస్లింలు జెండాలు చేత పట్టుకుని ఆర్కెస్ట్రాలో భక్తి పాటలు ఆలపిస్తూ ఊరేగింపుగా కదిలారు. అక్కడి నుంచి పెదబజార్, సంతబయల జాతీయ రహదారి మీదుగా అగ్రహారం వద్ద ఖాదరీబాబా ఇంటి వరకు ఊరేగింపు సాగింది. తిరిగి దర్గాకు చేరింది. ఈ సమయంలో ముస్లింలతోపాటు హిందువులు కూడా పెద్ద సంఖ్యలో దారి పొడవునా పాల్గొని చందనాన్ని దర్శించారు. ఊరేగింపు అనంతరం చందనాన్ని ఖాదరీబాబా సమాధికి పూశారు. భక్తులు చాదర్‌లు కప్పి, గులాబీ పూలతో పూజలు చేశారు. వివిధ రకాల పండ్లు, తీపి పదార్థాలను ప్రసాదంగా నివేదించారు. ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి ముస్లింలు, బాబా భక్తులు అధిక సంఖ్యలో హాజరై సమాధిని దర్శించి, ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాత్రి ఖవ్వాలి పాటల పోటీ ఉత్సాహంగా సాగింది. మూడో రోజు శనివారం సాయంత్రం మహిళల చిరాగి(దీపారాధన)తో ఉత్సవం ముగియనుందని నిర్వాహకులు తెలిపారు.



కశింకోటలో ఖాదరీ బాబా ఉరుసు ఊరేగింపు

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికుల డిమాండ్

అనకాపల్లిటౌన్: ప్రజా రవాణా వ్యవస్థ(ఆర్టీసీ) జోన్-1(విజయనగరం) పరిధిలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి వీఆర్ఎస్ఎస్ రావు కోరారు. జోనల్ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 27, 28 తేదీలలో డిపో వద్ద రిలే నిరాహార దీక్షల్లో భాగంగా శుక్రవారం స్థానిక డిపో వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల లీవ్ పొజిషన్ మెరుగుపర్చాలని, అవసరమైన వారికి నెలకు కనీసం మూడు లీవులు ఇవ్వాలని, అన్ని కేటగిరీల్లో ఖాళీ పోస్టులను భర్తీచేయాలని తదితర డిమాండ్లతో కార్మికులు దీక్షలు చేపట్టారు. మొదటి రోజు దీక్షలో ఎంజేపీకే రావు, ఎం.సన్యాసి, ఆర్ఎస్ఆర్ మూర్తి, జి.భవాని, సీహెచ్‌ఆర్ లక్ష్మి, ఎంవీఎస్‌ఏ రావు పాల్గొన్నారు. వీరికి డిపో అధ్యక్షుడు ఏఎస్ రావు, నాయకులు కేఎం రావు, వైఎస్ కుమార్, కేఎస్ రావు, ఎస్‌వీఎస్ నారాయణరావు తదితరులు సంఘీభావం తెలిపారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

సబ్బవరం: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఓ ప్రైవేటు గోల్డ్ లోన్ సంస్థ ప్రతినిధి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. సీఐ రంగనాథం తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి సమీపంలోని గొలగాం గ్రామానికి చెందిన సూరిశెట్టి ధర్మరాజు సబ్బవరం మండల కేంద్రంలోని ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ మణప్పురం గోల్డ్ లోన్ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ధర్మరాజు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి ఆర్థికంగా సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో డబ్బులు అడ్డదారిలో సంపాదించాలన్న ఆలోచన వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ నెల 23న విశాఖ నుంచి అనకాపల్లి బొద్దపు గోపీసత్యనారాయణ, అమ్మాజీ దంపతులు కారులో వెళుతున్నారు. సబ్బవరం మండలం దేవీపురం వద్దకు వచ్చేసరికి కారులో డీజిల్ అయిపోవడంతో ఆగిపోయింది. అదే సమయంలో అటుగా బైక్‌పై వెళుతున్న ధర్మరాజును గోపి లిఫ్ట్ అడిగి పెట్రోల్ బంక్ వద్ద దించమని కోరాడు. ఆ సమయంలో కారులో ఉన్న అమ్మాజీ మెడలో బంగారు ఆభరణాలను గమనించిన ధర్మరాజు గోపిని పెంట్రోల్ బంక్ వద్ద దించేందుకు అంగీకరించాడు. సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గోపిని దించి మళ్లీ వస్తానని చెప్పి ఆగిపోయిన కారు వద్దకు వచ్చాడు. కారు సీటులో కూర్చున్న గోపి భార్య అమ్మాజీ వద్దకు వెళ్లి డీజిల్ కోసం మీ వారు బాటిల్ ఇమ్మన్నారు అని చెప్పాడు. దీంతో ఆమె బాటిల్ కోసం ముందుకు వంగడంతో మెడలో ఉన్న 46.8 గ్రాముల బంగారు గొలుసు తెంచుకుపోయాడు. దీంతో లబోదిబోమంటూ బాధితురాలు భర్తకు విషయం తెలిపింది. వెంటనే బాధితులు సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ రోజు సీసీ ఫుటేజీలు, ఇతర ఆధారాలతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి కోసం తీవ్రంగా గాలించారు. శుక్రవారం ఉదయం నిందితుడ్ని సబ్బవరం మండలం అసకపల్లి వద్ద చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడు ధర్మరాజు నుంచి 46.8 గ్రాముల బంగారంతో పాటు పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీనగ్రామమైన రాజుపాలెం ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో రాజుపాలెం గొర్లివానిపాలెం ప్రజలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రక్త పరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు కూడా వైద్యసేవలు పొందవచ్చన్నారు. వైద్యశిబిరానికి నలుగురు స్పెషలిస్టు వైద్యులు హాజరై, రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. కంటిచూపు సమస్యలున్న వారికి ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్సలకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. రాజుపాలెం, గొర్లివానిపాలెం సచివాలయం పరిధి ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా రామకృష్ణ



తుమ్మపాల: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన కర్రి రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి గోపీశ్రీనివాస్ నియామక పత్రాన్ని అందించినట్లు రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఓబీసీల సమస్యలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తనని, తద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర, ప్రధాన కార్యదర్శులు బీవీఎస్ వర్మ, చదరం నాగేశ్వరరావు, పట్టాభి ప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థికి ప్రధాని నుంచి ప్రశంసా పత్రం



సత్యనాగచైతన్యను అభినందిస్తున్న కరెస్పాండెంట్ అనూరాధ

కశింకోట: కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసా పత్రం లభించింది. ప్రస్తుత విద్యా విధానంపై విద్యార్థుల అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకోవడానికి ఇటీవల నిర్వహించిన 'పరీక్షాపే చర్చా'పై రాత పూర్వకంగా స్కూల్‌కు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు తమ అభిప్రాయాలను తెలిపారు. ఉత్తమ అభిప్రాయాలు, ఆలోచనలు తెలిపిన స్కూల్ విద్యార్థి పి.సత్యనాగచైతన్యను ప్రధాని అభినందించి, ఉజ్వల భవిష్యత్ పొందాలని ఆకాంక్షిస్తూ ప్రశంసా పత్రాన్ని తపాలా ద్వారా పంపినట్లు స్కూల్ కరెస్పాండెంట్ బత్తుల అనూరాధ శుక్రవారం తెలిపారు. ప్రిన్సిపాల్ టి.షాజాది, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

ఆలయ స్థలం సత్యదేవుడి చెంతకు..

అనకాపల్లి టౌన్: రీ సర్వే పుణ్యమా అని కబ్జాకోరుల నుంచి 8 సెంట్ల ఆలయ భూమి సుంకరమెట్ట సత్యదేవుని ఆలయం చెంతకు చేరిందని ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు అన్నారు. శుక్రవారం ఆలయ సరిహద్దులను పరిశీలించి రీ సర్వే నిర్వహించారు. మంత్రి అమర్‌నాథ్ పూనుకోవడంతో ఇది సాధ్యమైందన్నారు.

9 నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలి?

- కార్యక్రమ విజయవంతానికి కృషి
- పార్టీ శ్రేణులతో జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ



పట్టణ, మండల పార్టీ అధ్యక్షులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లిటౌన్: వచ్చే నెల 9 నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమాన్ని జిల్లాలో నియోజకవర్గాల వారీగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్టీ పట్టణ, మండల అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అప్పటి నుంచే జిల్లాలో కూడా కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పట్టణం, మండలాల్లో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణస్థాయి నుంచి పార్టీశ్రేణులు కార్యక్రమాల నిర్వహణకు శక్తివంచన లేకుండా కృషి చేసేలా పార్టీ అధ్యక్షులు చొరవచూపాలన్నారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయి, 2019 నుంచి ఇప్పటి వరకు తమ ప్రభుత్వంలో హామీలు ఏ మేరకు అమలు చేశామో ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుని, నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పోలీస్ ఓపెన్ హౌస్



ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న పోలీసు అధికారులు

అనకాపల్లిటౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో శుక్రవారం పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ జరిగింది. వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులకు పట్టణ సీఐ మోహనరావు పోలీసు విధులు, వినియోగించే ఆయుధాలు, సాంకేతిక, డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్, క్లూస్‌టీం, ట్రాఫిక్, కమ్యూనికేషన్ పరికరాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, పట్టణ ఎస్ఐ సత్యనారాయణ, ఏఆర్ ఎస్ఐ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ శిబిరంలో యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరింది.